## క్లుప్తంగా

### అర్హులకు లబ్ధి చేకూరాలి

**గూడూరు:** వివిధ ప్రభుత్వ పథకాలకు అర్హులై ఉండి ఇప్పటి వరకు లబ్ధి పొందని వారికి లబ్ధి చేకూర్చేందుకు వలంటీర్లు ప్రత్యేక చొరవ తీసుకోవాలని గూడూరు ఎంపీడీఓ డి.సుబ్బారావు అన్నారు. తరకటూరు గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా వలంటీర్లు ఇంటింటికీ నిర్వహిస్తున్న సర్వేను ఎంపీడీఓ గురువారం పరిశీలించారు. వలంటీర్లు నిర్వహిస్తున్న సర్వేలో లోటుపాట్లను గుర్తించిన ఎంపీడీఓ వాటిని సరిదిద్దుకోవాలని సూచించారు.

### పంట కాలువకు మరమ్మతులు

**కోడూరు:** కోడూరు–అవనిగడ్డ ప్రధాన పంట కాలువకు ఇరిగేషన్ అధికారులు మరమ్మతులు చేపట్టారు. మండలంలోని జయపురం నుంచి వి.కొత్తపాలెం వరకు పలు ప్రాంతాల్లో కాలువ గట్టు కిందకు జారిపోయింది. సాగునీటి ప్రవాహానికి అడ్డులేకుండా కాలువ గట్టును పటిష్ట పరుస్తూ పొక్లెయిన్ సహాయంతో మరమ్మతులు నిర్వహించారు. కొంతమేర కాలువలో పూడిక తీత కూడా చేపట్టారు. తీరప్రాంత భూములకు కూడా పుష్కలంగా తాగు, సాగునీటిని అందించేందుకు అవసరమైన అన్ని పనులు చేస్తామని ఆ శాఖ డీఈ రవికిరణ్ తెలిపారు. పనులను పర్యవేక్షించారు.

### సీసీ రోడ్డు పనుల ప్రారంభం

**గూడూరు:** బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి మంజూరు చేసిన రూ.6.35 లక్షల ఎంపీ నిధులతో చేపట్టిన శ్మశాన వాటిక రోడ్డు నిర్మాణ పనులను గురువారం ప్రారంభించారు. గూడూరులోని కాపు, ఎస్సీ శ్మశాన వాటికలకు వెళ్లే మట్టి రోడ్డును సీసీ రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు ఎంపీ నిధులను మంజూరు చేశారు. రోడ్డు నిర్మాణ పనులను సర్పంచి లింగం సులోచనారాణి, పీఏసీఎస్ చైర్మన్ తలుపుల వెంకట కృష్ణారావు, వైఎస్సార్ సీపీ నాయకుడు ఫణి, విజయ్‌కుమార్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ తేజేష్ పరిశీలించారు.

### అన్నదానం

**మచిలీపట్నంటౌన్:** మచిలీపట్నం మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మోకా భాస్కరరావు వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక ఈడేపల్లిలోని ప్రభుత్వ వృద్ధాశ్రమంలో వృద్ధులు, దివ్యాంగులకు అన్నదానం చేశారు. భాస్కరరావు సతీమణి, నగర మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) వడ్డన చేశారు. మోకా భాస్కరరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డెప్యూటీ మేయర్ లంకా సూరిబాబు, వైఎస్సార్ సీపీ నాయకుడు బందెల థామస్ నోబుల్ తదితరులు పాల్గొన్నారు.

### సిమెంట్ బస్తాల పంపిణీ

**వెంకటాపురం(మోపిదేవి):** దైవజనులకు దేవుని కృప మరింత అందేలా సేవలు అందించాలని ఎంపీపీ రావి దుర్గావాణి అన్నారు. వెంకటాపురంలో సీయోను గాస్పెల్ మినిస్ట్రీస్ హాల్ 5వ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. పాస్టర్ కె. యోహానుబాబు క్రీస్తు సందేశం అందించారు. అనంతరం బోడగుంట గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న గృహాలకు అబ్బూరి విజయరాజు ఆధ్వర్యంలో రూ. 35 వేల విలువగల 100 సిమెంట్ కట్టలు 10 మందికి అందజేశారు.

### నిధులు మంజూరు చేయాలి

**చల్లపల్లి:** విద్యార్థుల సౌకర్యార్థం డైనింగ్ హాల్ నిర్మాణానికి నిధులు విడుదల చేయాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కై తేపల్లి దాస్ టీచర్స్ ఎమ్మెల్సీ టి.కల్పలత రెడ్డికి విన్నవించారు. తాను హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న చల్లపల్లి నారాయణరావు నగర్ ఎంపీపీ స్కూల్‌లో విద్యార్థుల సంఖ్య ఈ విద్యా సంవత్సరం 110కి పెరిగిన నేపథ్యంలో ఎమ్మెల్సీని కలిసి ఈ మేరకు దాస్ వినతిపత్రం సమర్పించారు.

### పథకాలపై అవగాహన

**మోపిదేవి:** గ్రామాల్లో సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అందులో భాగంగా గురువారం మండలంలోని పలు గ్రామాల్లో వలంటీర్లు ఇంటింటా తిరిగి వారి సమస్యలు గుర్తించి రికార్డు చేసుకున్నారు. మోపిదేవిలో ఇంటింటా తిరిగి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను స్థానికులకు వివరించారు. అర్హత ఉండి పింఛన్ అందకపోయినా, సర్టిఫికెట్ల మంజూరులో జాప్యం ఉన్నా ఈ నెల 5వ తేదీన గ్రామ సచివాలయాల వద్ద జరిగే శిబిరానికి హాజరై పరిష్కరించుకోవాలని సూచించారు.

### కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

**మోపిదేవి:** కారు ఢీకొనడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బండికోళ్లంకకు చెందిన మాతంగి జనార్దనరావు పనిమీద ద్విచక్ర వాహనంపై మోపిదేవి వెళ్లాడు. పని ముగించుకుని గురువారం రాత్రి బండికోళ్లంకకు బయలుదేరాడు. రాత్రి సుమారు 9 గంటల సమయంలో అవనిగడ్డ నుంచి చల్లపల్లి వైపు జాతీయ రహదారిపై వెళుతున్న కారు వేగంగా వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జనార్దనరావుకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడిని 108 వాహనంలో అవనిగడ్డ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### నిత్యావసరాలు వితరణ

**నాగాయలంక:** హైదరాబాద్‌కు చెందిన పారిశ్రామికవేత్త కావూరి రవీంద్రకుమార్ ఆర్థిక సౌజన్యంతో స్థానిక వృద్ధాశ్రమానికి నిత్యావసర సరుకులు, బియ్యం పంపిణీ చేశారు. స్నేహ సొసైటీ ప్రధాన కార్యదర్శి సామర్ల మల్లికార్జునరావు ఆధ్వర్యంలో వీటిని ఆశ్రమ నిర్వాహకులు తలశిల లీలా మనోహర్‌కు అందజేశారు. అనంతరం నాగాయలంక సాయిబాబా మందిరంలో 60 మంది పేదలకు అన్నదానం చేశారు.

# ఘనంగా బక్రీద్ వేడుకలు

**మసీదులు, ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు**



పెడన ఈద్గా వద్ద నమాజ్‌లో పాల్గొన్న ముస్లింలు

**అవనిగడ్డ:** అవనిగడ్డ, మచిలీపట్నం, పెడన నియోజకవర్గాల్లో గురువారం బక్రీద్ పర్వదిన వేడుకలు ఘనంగా జరిగాయి. అవనిగడ్డ పంచాయతీ పరిధి ఏడో వార్డులోని మసీదు వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన నమాజులో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు పాల్గొని ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ త్యాగానికి ప్రతీక బక్రీద్ అన్నారు. ఆయన త్యాగాన్ని నిత్యం మననం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, మసీదు ప్రెసిడెంట్ అబ్దుల్ రెహమాన్, షాదీఖానా ప్రెసిడెంట్ అబ్దుల్ అజీజ్, మండల కో–ఆప్షన్ సభ్యులు షేక్ నజీర్ బాషా, సచివాలయ కన్వీనర్ ఖాదర్ వలీ, మైనారిటీ సెల్ అధ్యక్షుడు చాంద్‌బాషా, ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

**భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు**

**కోడూరు:** త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చినగుడుమోటులో ప్రతి ఇంటి వద్ద పండుగ శోభ ఉట్టిపడింది. పెదగుడుమోటు, కోడూరు, నరసింహపురం మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బక్రీద్ విశిష్టతను ఇమామ్‌లు వివరించారు. ఇతర గ్రామాల్లో స్థిరపడిన ముస్లింలు స్వగ్రామాలకు తరలిరావడంతో పండుగ వాతావరణం నెలకొంది.

● **గూడూరు:** త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పర్వదినాన్ని గూడూరు మండలంలోని ముస్లింలు గురువారం అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. గూడూరులోని జామియా మసీదులో హాఫిజ్ మొహమ్మద్ షోయబ్ ఆధ్వర్యంలో ఈద్ నమాజులు ఆచరించారు. ఈ సందర్భంగా ఈద్ ప్రసంగం ఇచ్చారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. మండలంలోని మల్లవోలు, ఆకులమన్నాడు, షా అబ్దుల్లాపాలెం, పినగూడూరులంక, తరకటూరు, పోలవరం గ్రామాల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి.

**చల్లపల్లిలో..**

**చల్లపల్లి:** త్యాగానికి ప్రతీక బక్రీద్ పర్వదిన వేడుకలను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. గురువారం స్థానిక మసీదు నుంచి ముస్లింలు భారీ ర్యాలీగా ట్రావెలర్స్ బంగ్లా వెనుక ఉన్న ఈద్గా మైదానానికి చేరుకున్నారు. మత గురువు బక్రీద్ పండుగ ప్రాముఖ్యత, ఇబ్రహీం, ఇస్మాయిల్‌ల త్యాగ నిరతిని వివరించారు. ఈదుల్ అజ్‌హాను పురస్కరించుకుని ప్రత్యేక నమాజ్ చేసి ప్రపంచ శాంతి కోసం ప్రార్థనలు చేశారు. అనంతరం పేదలకు దానధర్మాలు, ఖుర్బానీ దానాలు చేశారు.

**బంటుమిల్లిలో..**

**బంటుమిల్లి:** స్థానిక ఖాదిర్ జామియా మసీదు కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఈద్గా మైదానంలో బక్రీద్ ప్రార్థనలు జరిగాయి. మత గురువు ముజఫర్ హుస్సేన్ ప్రత్యేక ప్రార్థనలు చేసి బక్రీద్ పండుగ విశిష్టతను వివరించారు. అనంతరం పలువురు ముస్లింల శ్మశానవాటికకు వెళ్లి వారి పెద్దల సమాధుల వద్ద నివాళులర్పించి వారిని స్మరించుకున్నారు. కార్యక్రమంలో మసీద్ కమిటీ అధ్యక్షుడు, ఎంపీటీసీ ఎండీ కమాల్‌బాషా, సభ్యులు ఎండీ నజీర్‌ఖాన్, అబ్దుల్ ఆలీం, ఎండీ జానీ, మాజీ సర్పంచ్ ఎండీ అమీర్, ఎండీ అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

**ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు**

**పెడన:** బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం పట్టణంలోని పలు మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గుడివాడ రోడ్డులోని ఈద్గాల వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మత గురువులు బక్రీద్ ప్రాధాన్యతను వివరించారు. అనంతరం ముస్లింలు ఒకరిని ఒకరు ఆలింగనం చేసుకుని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. జామియా మసీదుతో పాటు ఆయా వార్డుల్లోని మసీదులలోని ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దర్గాల వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేసి శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

**మచిలీపట్నంలో..**

**మచిలీపట్నంటౌన్:** బక్రీద్ సందర్భంగా నగరంలోని ముస్లింలు ముస్తాఖాన్‌పేట ఈద్గాలో గురువారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ షేక్ అచ్చెబా, వైఎస్సార్ సీపీ మైనార్టీ నాయకులు మొహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు. ముస్లింలకు పేర్ని కిట్టు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. పలు మసీదుల్లో ముస్లింలు బక్రీద్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతున్న పేర్ని కిట్టు



అవనిగడ్డలో నమాజ్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే సింహాద్రి, కడవకొల్లు



చల్లపల్లి ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



బంటుమిల్లి ఈద్గా మైదానంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

## పవన్‌కుమార్ కుటుంబానికి అండగా ఉంటాం

మంత్రి జోగి రమేష్



పవన్ కుమార్ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న మంత్రి జోగి రమేష్

**పెడన:** సచివాలయంలో విధులు నిర్వహించే ఎనర్జీ అసిస్టెంట్ పవన్‌కుమార్ కుటుంబానికి అండగా ఉంటామని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ అన్నారు. గురువారం ఉదయం పుల్లపాడు గ్రామంలోని పవన్ కుమార్ నివాసానికి చేరుకుని కుటుంబ సభ్యులకు రూ.5.20 లక్షల ఆర్థిక సాయాన్ని మంత్రి జోగి రమేష్ అందజేశారు. పవన్‌కుమార్ ఈ నెల 18న ప్రమాదవశాత్తు మృతిచెందాడు. మచిలీపట్నం డివిజన్‌లోని ఉద్యోగులంతా కలిసి సేకరించిన రూ. 5.20 లక్షలను మంత్రి చేతుల మీదుగా పవన్‌కుమార్ కుటుంబ సభ్యులకు అందించామని సంఘ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో పెడన మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గరికపాటి చారుమతి, మచిలీపట్నం డివిజన్ డీఈ ఎం. భాస్కరరావు, పెడన ఏడీఈ సీహెచ్ మాణిక్యాలరావు, ఏఈ జయరాం, వైఎస్సార్ సీపీ నాయకులు నాగబాబు, సుబ్రహ్మణ్యం, ఉద్యోగ సంఘ నాయకులు పాల్గొన్నారు.

## బంటుమిల్లిలో పెట్రోల్ బంక్ ప్రారంభం



**బంటుమిల్లి:** బంటుమిల్లిలో భారత్ పెట్రోల్ బంకును రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ గురువారం ప్రారంభించారు. గత కొద్ది నెలలుగా బంకు మూతపడి ఉంది. బంకును కంపెనీ వారు పెడన ప్రాంతానికి చెందిన పామర్తి చిన్నికి అప్పగించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలతో పెట్రోల్ ఉత్పత్తులు విక్రయించి వాహనదారుల మన్ననలు పొందాలని సూచించారు. జెడ్పీటీసీ ఎం. వెంకటరమణ, ఏఎంసీ చైర్మన్ కె. గంగాధర్, వైస్ ఎంపీపీ ఓ. చిన్నారిబాబు, సచివాలయాల మండల కన్వీనరు కె. సుబ్బారావు, ఎం. రాజబాబు పాల్గొన్నారు.

### లబ్ధిదారులకు స్థలాల అప్పగింత

**మచిలీపట్నంటౌన్:** గిలకలదిండి జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారులకు గురువారం ఎమ్మెల్యే పేర్ని నాని స్థలాలను అప్పగించారు. గతంలో 20వ డివిజన్ గిలకలదిండికి చెందిన 942 మందికి జగనన్న కాలనీల్లో ఇళ్లస్థలాల పట్టాలను పంపిణీ చేశారు. అయితే స్థలం పల్లంగా ఉండటంతో మెరక పనులు పూర్తికావడంతో స్థలాలను లబ్ధిదారులకు ఎమ్మెల్యే పేర్ని నాని అప్పగించారు. గ్రామానికి విచ్చేసిన పేర్ని నానికి గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. పేర్ని నాని మాట్లాడుతూ స్థలాలు పొందిన లబ్ధిదారులు పక్కా గృహాలను త్వరితగతిన నిర్మించుకోవాలని సూచించారు. స్థలాల పంపిణీకి సహకరించిన అధికారులు, సిబ్బందిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ తిరుమలశెట్టి వరప్రసాద్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

### క్షీరబంధు చెక్కు అందజేత

**మోపిదేవి:** స్థానిక బీసీ యాదవపాలెంకు చెందిన గొరిపర్తి భిక్షాలు ఇటీవల మృతిచెందాడు. క్షీర బంధు పథకం కింద రూ. 50 వేల చెక్కును పాల కేంద్రం అధ్యక్షుడు బొందలపాటి ప్రసాద్ గురువారం మృతుడి భార్య సంపూర్ణమ్మకు గురువారం అందజేశారు. పామర్రు పాల శీతలీకరణ కేంద్రం మేనేజర్ చిట్టూరి దామోదర కృష్ణ గోపీనాథ్, జిల్లా సభ్యుడు వేమూరి సాయి వెంకట రమణ, ట్రస్ట్ బోర్డు డైరెక్టర్ గోళ్ల పూర్ణ మల్లికార్జునరావు పాల్గొన్నారు.

# అమ్మవార్లకు ఆషాఢ సారె సమర్పణ



నాగాయలంకలో దుర్గమ్మ అమ్మవారి ఆషాఢ సారె పూజలో పాల్గొన్న భక్తులు



బందరులో ఆషాఢ సారెను ఊరేగింపుగా తీసుకువస్తున్న భక్తులు

**నాగాయలంక:** ఆషాఢ మాసం, తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీరామపాద క్షేత్రం ప్రాంగణంలోని కనకదుర్గమ్మ దేవస్థానంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోసుబొమ్మ కూడలిలోని పోతురాజుస్వామి దేవాలయంలో అమ్మవారి సారెకు పూజలు జరిపారు. అనంతరం క్షేత్రం చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు పర్యవేక్షణలో ప్రధాన వీధుల్లో మహిళలు ఊరేగింపుగా సారె పళ్లాలతో కృష్ణాతీరానికి చేరుకున్నారు. మార్గమధ్యంలో కన్యకా పరమేశ్వరిదేవి, ప్రసన్న గణపతి దేవాలయాల్లో ప్రదక్షిణలు చేశారు. అనంతరం కనకదుర్గమ్మ ఆలయంలో అర్చకుడు ముదునూరి శ్రీనివాసశాస్త్రి బ్రహ్మత్వంలో ఆషాఢ సారె పూజలు నిర్వహించారు. నాగాయలంక, పరిసర గ్రామాల మహిళలు అమ్మవారికి ఆషాఢ సారె సమర్పించారు. గ్రామంలోని తలశిల వారి గంగానమ్మ తల్లి ఆలయం తరపున కమిటీ పెద్దలు శివరామకృష్ణ, శ్రీనివాసరావు దుర్గమ్మకు ప్రత్యేక సారె సమర్పించారు. పూజల్లో పాల్గొన్న మహిళలు, భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఉప్పల లీలాకృష్ణప్రసాద్, బోయపాటి రాము, ఎస్‌బీబీవీ ప్రసాద్, వంకాయల ఆది రాజేష్, సంకర్షణ భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

● **పెడన:** వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలోని వాసవీ మాతకు, ఒకటో వార్డులోని పైడమ్మ దేవస్థానంలోని పైడమ్మ అమ్మవారికి గురువారం పట్టణ ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆషాఢ సారె సమర్పించి పూజలు చేశారు. కార్యక్రమంలో మహిళా మండలి గౌరవ సలహాదారురాలు మంజులత, లక్ష్మీ, సుధారాణి, లక్ష్మీతాయారు, సావిత్రి తదితరులు పాల్గొన్నారు. పట్టణ ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు కొల్లూరి సత్యనారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి రాజా పర్యవేక్షించారు.

● **కోడూరు:** మాచవరం తుంగపల్లెమ్మ అమ్మవారికి గురువారం భక్తులు ఆషాఢ సారెను సమర్పించారు. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పట్టుచీర, పూలు, గాజులు, పసుపు, కుంకుమను సారె రూపంలో అమ్మవారికి సమర్పించారు. సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ఫౌండేషన్ సభ్యులు పర్యవేక్షించారు.

**తొలి ఏకాదశి ప్రత్యేక పూజలు**

**పెడన:** పట్టణంతో పాటు మండలంలోని వైష్ణవాలయాల్లో గురువారం తొలి ఏకాదశి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు పేల పిండిని స్వామికి నైవేద్యంగా సమర్పించి దానిని తిరిగి ప్రసాదంగా తీసుకున్నారు. గుడివాడ రోడ్డులోని వేణుగోపాల స్వామి ఆలయం, తోటమూలలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**బంటుమిల్లిలో..**

**బంటుమిల్లి:** మండలలోని వైష్ణవాలయాల్లో గురువారం తొలి ఏకాదశి పూజలు వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు చేయించారు. భక్తులు ఇళ్ల వద్ద పేల పిండి తయారు చేసి స్వామివారికి సమర్పించి ప్రసాదంగా తీసుకున్నారు. బంటుమిల్లి వేంకటేశ్వరస్వామి, సీతారామచంద్రస్వామి, అర్తమూరు సత్యనారాయణస్వామి, చోరంపూడి, ముంజులూరు, మల్లేశ్వరం గ్రామాల్లోని రామాలయాల్లో ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు.



పెడన వేణుగోపాలస్వామికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

**భక్తిశ్రద్ధలతో పూజలు**

**మచిలీపట్నంటౌన్:** వాసవీక్లబ్ ఇంటర్నేషనల్, వాసవీ వనిత క్లబ్ ఆధ్వర్యంలో బచ్చుపేట వేంకటేశ్వరస్వామి ఆలయ కల్యాణ మండపంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. 108 మంది దంపతులు వ్రత కార్యక్రమంలో పాల్గొన్నారు. అన్నసమారాధన నిర్వహించారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి(కిట్టు), వాసవీ క్లబ్ మచిలీపట్నం శాఖ ప్రతినిధులు అశోక్‌కుమార్, పవన్‌కుమార్, వరప్రసాద్, వనిత క్లబ్ ప్రతినిధులు దివ్యశ్రీ, అనూరాధ, సునీత పాల్గొన్నారు.

**సీతమ్మకు ఆషాఢ సారె..**

నగరంలోని కొబ్బరితోట ఎన్‌జీఓ కాలనీలోని సంతాన భద్రాద్రి రామాలయంలో సీతమ్మకు మహిళా భక్తులు ఆషాఢసారె అందజేశారు. 54 రకాల పిండి వంటలతో, తొమ్మిది రకాల పండ్లు, పూలను మేళ తాళాల మధ్య ఊరేగించి అమ్మవారికి సమర్పించారు.

## ఆధ్యాత్మిక శోభతో పులకించిన ఉల్లిపాలెం



హోమాలు నిర్వహిస్తున్న పండితులు

**కోడూరు:** అభినవ మేల్కోటగా పేరుగాంచిన ఉల్లిపాలెంలోని గోదా, రాజ్యలక్ష్మీ సమేత శ్రీమన్నారాయణ స్వామి వారి ఆలయం ఆధ్యాత్మిక శోభతో పులకించింది. తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం ఆలయంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అష్టాక్షరీ పీఠాధిపతి త్రిదండి అష్టాక్షరీ సంపత్‌కుమార రామానుజీయర్ స్వామీజీ పర్యవేక్షణలో ఉదయం ఉత్సవమూర్తులకు తిరుమంజన సేవ, ప్రత్యేక జలాలను 108 కలశాలలో ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీమన్నారాయణుడి మూలమూర్తికి అభిషేకాలు నిర్వహించారు. తొలి ఏకాదశి పర్వదినం విశిష్టతను అష్టాక్షరీ స్వామీజీ వివరించారు. రాజ్యలక్ష్మీ, గోదాదేవి అమ్మవార్లకు సామూహిక కుంకుమార్చన జరిగింది. తొలుత ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక హోమాలు నిర్వహించారు..

**కోలాట భజనల నడుమ నగరోత్సవం..**

స్వామివార్ల ఉత్సవ మూర్తులను ప్రత్యేక పల్లకీలో ఉంచి నగరోత్సవం నిర్వహించారు. భక్తమండళ్ల కోలాట భజనల నడుమ గ్రామ వీధుల వెంట స్వామివార్లను ఊరేగించారు. ఆలయ ప్రాంగణంలో భక్తమండళ్ల సభ్యులు విష్ణు సహస్రనామ పారాయణ ఏకాహం నిర్వహించారు. తులసీ దళాలతో స్వామివారికి పూజలు చేశారు. బెంగళూరు, కర్నూలు, హైదరాబాద్, విజయవాడకు చెందిన పలువురు దంపతులు ఉత్సవాలకు ఉభయ దాతలుగా వ్యవహరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

### కోడూరులో మూడు చోరీలు

**కోడూరు:** కోడూరులో బుధవారం అర్ధరాత్రి దొంగలు పెట్రేగిపోయారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్వతంత్రపురం గ్రామానికి చెందిన శివాజీ కోడూరు తూర్పు వైపు కొత్తగా ఇంటిని నిర్మించుకుంటున్నారు. బుధవారం రాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి వద్ద ఉన్న మోటర్‌ను చోరీ చేశారు. మెరక గొడపాలెంకు చెందిన మురాల వెంకట సాయిబాబు తన ఆటోను బుధవారం రాత్రి కిరాయిలు పూర్తి చేసుకొని ఇంటి ఆవరణలో నిలిపాడు. గురువారం ఉదయం చూస్తే ఆటోలోని స్టెపినీ టైరు, చక్రం కనిపించలేదు. అదే గ్రామానికి చెందిన పెద్ది సుబ్బారాయుడు ఇంటి వద్ద ట్రాక్టర్‌కు సంబంధించిన బ్యాటరీ, ఆడియా ప్లేయర్ అపహరణకు గురయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులను అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నట్లు సమాచారం.

### మైక్, నాగపడగ అందజేత

**భావదేవరపల్లి(నాగాయలంక):** స్థానిక అన్నపూర్ణాదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయానికి గురువారం రూ.30 వేల విలువైన మైక్ సిస్టమ్‌ను గ్రామానికి చెందిన బండే వెంకటేశ్వరరావు బహూకరించారు. నాగాయలంక దుర్గాగణపేశ్వర ఆటోమొబైల్స్ యజమానులు వర్రే రాఘవరావు, శివశంకర్ రూ.15 వేల విలువైన ఇత్తడి ధారాపాత్ర, నాగపడగను అందించారు.

### రాజదండం సమర్పణ

**మచిలీపట్నంటౌన్:** రుస్తుంబాదలోని భద్రాద్రి రాముల వారికి చింతగుంటపాలెంకు చెందిన కనగాల జయచంద్ర పద్మనాభరావు, లక్ష్మీ దంపతులు గురువారం వెండి రాజదండంను బహూకరించారు. అర కిలో వెండితో తయారు చేసిన రాజదండాన్ని ఆలయ అర్చకుడు బాలశేష కృష్ణమాచార్యులు ద్వారా ఆలయ చైర్మన్ హనుమకొండ శ్రీధర్‌కు అందజేశారు.

## జేసీఎస్ ఇన్‌చార్జీల నియామకం

**చిలకలపూడి(మచిలీపట్నం):** మచిలీపట్నం నియోజకవర్గంలో జేసీఎస్ ఇన్‌చార్జీలుగా వైఎస్సార్ సీపీ నాయకులను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. మచిలీపట్నం నియోజకవర్గంలోని మండలానికి వాలిశెట్టి రవిశంకర్, శొంఠి ఫరీద్‌లను నియమించారు. మచిలీపట్నం నగర పాలక సంస్థ పరిధిలో చిటికిన నాగేశ్వరరావు, శీలం జయవెంకట చంద్రమారుతీరావు (బాబ్జీ), గూడవల్లి నాగరాజులను నియమించారు.

**పెడన నియోజకవర్గంలో..**

**పెడన:** పెడన నియోజకవర్గంలోని బంటుమిల్లి మండల ఇన్‌చార్జిగా కొప్పర్తి సుబ్బారావు, గూడూరు మండలానికి కనపర్తి రాజు, కృత్తివెన్ను మండలానికి కొక్కిలిగడ్డ బాపూజీ, పెడన మండలానికి బెజవాడ నాగబాబు, పెడన పట్టణానికి ఎండీ మతీన్‌ఖాన్‌లను నియమించారు.

**అవనిగడ్డ:** అవనిగడ్డ మండలానికి షేక్ నజీర్‌బాషా, కోడూరుకు కడవకొల్లు శ్రీనివాసరావు, నాగాయలంకకు మద్ది వెంకట నారాయణ, మోపిదేవికి కోసూరు శివనాగేశ్వరరావు, చల్లపల్లికి యడ్ల జగదీష్, ఘంటసాలకు వేమూరి ప్రవీణ్‌ను నియమించారు.

### ఆంజనేయునికి అరటిపండ్లతో అలంకారం

**చిలకలపూడి(మచిలీపట్నం):** తొలి ఏకాదశి సందర్భంగా ఈడేపల్లి ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రతినిధులు అరటిపండ్లతో స్వామివారిని అలంకరించారు. హనుమాన్‌చాలీసా పారాయణం చేశారు.

### పార్కు స్థల దాత స్వామి నాయుడుకు నివాళి

**మచిలీపట్నం టౌన్:** ప్రధాన రహదారిలోని మునిసిపల్ ప్రధాన పార్క్ స్థల దాత దివంగత మాకర్ల వెంకటస్వామి నాయుడు వర్ధంతి కార్యక్రమం గురువారం నిర్వహించారు. ప్రధాన పార్క్‌లోని ఆయన విగ్రహానికి విగ్రహ కమిటీ అధ్యక్షుడు పిల్లారిశెట్టి శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్క్ సూపర్‌వైజర్ రంగబాబు, పార్కు సిబ్బందికి ఆయన నూతన వస్త్రాలు బహూకరించారు. కార్యక్రమంలో పిల్లారిశెట్టి సత్యనారాయణ, కె. మహేష్, మాదిరెడ్డి అంజిబాబు, హరినాథ్, ఆంజనేయులు, పరిమి అప్పలస్వామి, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

### ఐవీఎం సేవలు ప్రశంసనీయం

**చల్లపల్లి:** నిరుపేదల సేవలో తరిస్తున్న ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ సేవలు ప్రశంసనీయమని ఎస్‌ఐ సీహెచ్ చినబాబు అన్నారు. గురువారం స్థానిక నారాయణరావు నగర్, కోమలా నగర్ ప్రాంతాల్లోని రెండు మురికివాడల్లో జీవిస్తున్న 80 నిరుపేద కుటుంబాల వారికి ఐవీఎం డైరెక్టర్ డాక్టర్ వేములపల్లి సురేష్‌బాబు ఆర్థిక సహకారంతో రూ.80 వేల విలువ కలిగిన నిత్యావసర సరుకులను అందజేశారు. కోవిడ్ నాటి నుంచి నేటి వరకు ప్రతి నెలా క్రమం తప్పకుండా ఐవీఎం సురేష్ ఇక్కడి పేదలకు అందిస్తున్న సహాయం అభినందనీయమని ఎస్‌ఐ అన్నారు.